క్లుప్తంగా

పక్కాగా ఎన్సీడీ సర్వే


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న సుజాత

నెల్లూరు(అర్బన్): ఎన్సీడీ 4.0 సర్వేను పక్కాగా నిర్వహించేందుకు చర్యలు చేపట్టామని డీఎంహెచ్ఓ సుజాత పేర్కొన్నారు. ఎన్సీడీ హౌస్ హోల్డ్ సర్వేపై ఏరియా, సామాజిక ఆస్పత్రుల నుంచి ఎంపికైన వైద్యులకు శిక్షణ కార్యక్రమాన్ని నగరంలోని ప్రభుత్వ మెడికల్ కళాశాలలో మంగళవారం నిర్వహించారు. వివిధ అంశాలపై అవగాహన కల్పించారు.

ధాన్యం సేకరణపై సమావేశం


మాట్లాడుతున్న కార్తీక్

నెల్లూరు రూరల్: ధాన్యం వ్యాపారులతో సమావేశాన్ని జేసీ కార్తీక్ తన చాంబర్‌లో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రైతుల నుంచి ధాన్యాన్ని సేకరించే వ్యాపారులు అనుమతులను పొందాలని సూచించారు. వివిధ సమస్యలను వ్యాపారులు తెలియజేశారు. పౌరసరఫరాల సంస్థ డీఎం అర్జున్‌రావు, డీఎస్‌ఓ విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అథ్లెటిక్స్ కోచ్‌కు అభినందన



నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో అథ్లెటిక్స్ కోచ్‌గా విధులు నిర్వర్తిస్తున్న రజనీకాంత్‌ను క్రీడాకారులు అభినందించారు. స్టేడియంలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో క్రీడాకారులు దుర్గాప్రసాద్, ప్రసన్నకుమార్, శ్రీనివాసులు, తరుణ్, శ్రీనాథ్, విశ్వనాథ్, నవీన్, సాయి, మౌర్య, హరీష్, హేమలత తదితరులు పాల్గొన్నారు.

తల్లి పాలతో రోగ నిరోధక శక్తి


సీమంతాలు నిర్వహిస్తున్న అధికారులు

నెల్లూరు (పొగతోట): పుట్టిన బిడ్డకు గంటలోపే తల్లి పాలను తప్పనిసరిగా తాగించాలని, దీంతో రోగ నిరోధక శక్తి పెరుగుతుందని ఐసీడీఎస్ పీడీ హేనాసుజన్ పేర్కొన్నారు. తల్లి పాల వారోత్సవాలను పురస్కరించుకొని నగరంలో ర్యాలీని మంగళవారం నిర్వహించారు. అనంతరం మహిళా ప్రాంగణంలో సీమంతాలను జరిపారు.

ఆశ వర్కర్లతో సమావేశం



నెల్లూరు సిటీ: ఆశ వర్కర్లతో సమీక్ష సమావేశాన్ని సౌత్‌మోపూరు పీహెచ్‌సీలో డాక్టర్ రవీంద్రనాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఆల్బెండాజోల్ మాత్రలను ఈ నెల 12న పిల్లలకు అందజేయాలని సూచించారు. తల్లిపాల వారోత్సవాలు, జాతీయ నులిపురుగుల దినోత్సవంపై సూచనలు చేశారు. డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ అశోక్, పెంచలయ్య, హెల్త్ సూపర్‌వైజర్లు రసూల్, రామారావు పాల్గొన్నారు.

చెత్త నుంచి సంపద తయారీపై శిక్షణ

ముత్తుకూరు(పొదలకూరు): ముత్తుకూరు మండలం పిడతాపోలూరు చెత్త నుంచి సంపద తయారీ కేంద్రంలో జిల్లాలోని ఎంపీడీఓలు, ఇతర అధికారులకు శిక్షణ ఇచ్చినట్టు జెడ్పీ సీఈఓ మోహన్‌రావు తెలిపారు. కేంద్రం వద్ద సీఈఓ, డీపీఓ శ్రీధర్‌రెడ్డితో కలిసి మంగళవారం మాట్లాడారు. ప్రతి గ్రామంలో చెత్తను సేకరించాల్సిందిగా ఆదేశాలు ఉన్నాయన్నారు.

ఎల్ఆర్ఎస్‌ను సద్వినియోగం చేసుకోండి


మాట్లాడుతున్న స్రవంతి

నెల్లూరు(బారకాసు): ఎల్ఆర్ఎస్ పథకాన్ని నగర పాలక సంస్థ పరిధిలోని అనధికార లేఅవుట్ల యజమానులు సద్వినియోగం చేసుకోవాలని మేయర్ స్రవంతి కోరారు. నక్ష సర్వే, అనధికార లే అవుట్లు, ప్లాట్ల క్రమబద్ధీకరణ అంశాలపై ప్రజాప్రతినిధులు, ఎల్టీపీలు, బిల్డర్లకు అవగాహన సదస్సును కార్పొరేషన్ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో టౌన్ ప్లానింగ్ విభాగ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. తాజా ఉత్తర్వుల మేరకు ఈ ఏడాది జూన్ 30 వరకు రిజిస్ట్రేషన్ ద్వారా కొనుగోలు చేసిన ప్లాట్ల క్రమబద్ధీకరణకు అవకాశం ఉందని వివరించారు. నక్ష సర్వేకు ప్రజలు సహకరించాలని కోరారు. నగరపాలక సంస్థ కో ఆప్షన్ సభ్యులు చాట్ల నరసింహరావు, జమీర్, కార్పొరేటర్లు కర్తం ప్రతాప్‌రెడ్డి, పొట్లూరి రామకృష్ణ, శ్రీకాంత్‌రెడ్డి, నేతలు గణేశం వెంకటేశ్వర్లు, శ్రీధర్, ఏసీపీ మురళి, ఇన్‌చార్జి సూపరింటెండెంట్ కృష్ణకిశోర్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ కేసులతో ఉద్యమాన్ని ఆపలేరు



మాట్లాడుతున్న సీపీఎం నేతలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): గిరిజనుల భూముల కోసం ఉద్యమాలు చేస్తున్న వారిని అక్రమంగా అరెస్ట్ చేయగా, వారి కుటుంబాలను పరామర్శించేందుకు వెళ్లిన రైతు సంఘ నేతలపై అక్రమ కేసులు బనాయించి అరెస్ట్ చేయడం దారుణమని, ఇలాంటి చర్యలతో ఉద్యమాలను ఆపలేరని సీపీఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్ పేర్కొన్నారు. బాలాజీనగర్‌లోని పార్టీ జిల్లా కార్యాలయంలో విలేకరులతో మంగళవారం ఆయన మాట్లాడారు. కరేడులో ఎలాగైనా భూసేకరణను చేపట్టాలనే ఉద్దేశంతో గిరిజనులు, రైతులపై అక్రమ కేసులను స్థానిక టీడీపీ ఎమ్మెల్యే పెట్టించారని ఆరోపించారు. పరామర్శించేందుకు కరేడుకు వెళ్లిన రైతు కూలీ, వ్యవసాయ కార్మిక సంఘ జిల్లా కార్యదర్శులు వెంగయ్య, పుల్లయ్యను పోలీసులు అక్రమంగా అరెస్ట్ చేయడం దారుణమన్నారు. ఈ వ్యవహారంలో ఎస్పీ, కలెక్టర్ జోక్యం చేసుకోవాలని కోరారు. నేతలు మాదాల వెంకటేశ్వర్లు, మోహన్‌రావు, అజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ర్యాగింగ్‌కు దూరంగా ఉండాలి


ఇన్‌స్పెక్టర్‌కు సత్కారం

నెల్లూరు (టౌన్): ర్యాగింగ్‌పై విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నగరంలోని నారాయణ ఇంజినీరింగ్ కళాశాలలో యాంటీ ర్యాగింగ్ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా బాలాజీనగర్ ఇన్‌స్పెక్టర్ సాంబశివరావు మాట్లాడారు. ర్యాగింగ్‌కు దూరంగా ఉండాలని సూచించారు. అనంతరం ఆయన్ను సత్కరించారు. ప్రిన్సిపల్ శ్రీనివాసులురెడ్డి, వైస్ ప్రిన్సిపల్ హాజరత్తయ్య, ఈసీఈ విభాగాధిపతి మురళి, ఏజీఎం శ్రీధర్, ఎన్నెస్సెస్ ప్రోగ్రామ్ అధికారి చంద్రమోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అభినందన

నేపాల్‌తో జరిగిన స్నేహపూరిత క్రికెట్ పోటీల్లో భారత జట్టు తరఫున పాల్గొన్న నారాయణ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థి సూర్యను అభినందించారు. యూత్ స్పోర్ట్స్ ప్రమోషన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇంటర్నేషనల్ చాంపియన్‌షిప్‌లో భాగంగా పోటీలను నిర్వహించారు. ప్రిన్సిపల్ శ్రీనివాసులు రెడ్డి, అధ్యాపకులు వరప్రసాద్‌రావు, మురళి, కిశోర్ పాల్గొన్నారు.

విశేషాలంకారంలో కన్యకాపరమేశ్వరి



నెల్లూరు(బృందావనం): శ్రావణ మాస మంగళవారాన్ని పురస్కరించుకొని స్టోన్‌హౌస్‌పేటలోని కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో అమ్మవారు కొల్హాపురి మహాలక్ష్మిగా దర్శనమిచ్చారు. కుంకుమ పూజను 500 మంది భక్తులు నిర్వహించారు. ఉభయకర్తలుగా గుండ్లపల్లి పద్మప్రియ బృందం వ్యవహరించింది. అమ్మవారికి పూలంగిసేవను కనులపండువగా సాయంత్రం నిర్వహించారు. సౌభాగ్య పసుపు, కుంకుమ కార్యక్రమాన్ని చేపట్టి 108 మంది మహిళలకు పసుపు, కుంకుమ, జాకెట్, గాజులను అందజేశారు. అనంతరం వెండి రథంపై దర్శనమిచ్చారు. దేవస్థాన పాలకమండలి చైర్మన్ కోట గురుబ్రహ్మం, కార్యనిర్వాహక అధ్యక్షుడు శేగు షణ్ముఖరావు, ప్రధాన కార్యదర్శి చిరంజీవి, కోశాధికారి ఉమ్మెన జనార్దన్, ఉపాధ్యక్షుడు వేముల వెంకటప్రసాద్, సహాయ కార్యదర్శి మునగా వెంకటేశ్వర్లు, గౌరవ సలహాదారులు ఆంజనేయులు, వెంకటేశ్వర్లు, ప్రవీణ్, సురేష్‌బాబు, మురళి, బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

స్పీడ్ బ్రేకర్ల ఏర్పాటుకు డిమాండ్


మాట్లాడుతున్న బీజేపీ నేతలు

నెల్లూరు రూరల్: నగరంలోని కోనేటిమిట్టకు వెళ్లే మార్గంలో స్పీడ్ బ్రేకర్లను ఏర్పాటు చేయాలని బీజేపీ నేతలు డిమాండ్ చేశారు. మూలాపేటలో బీజేపీ మండల శాఖ సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ నెల 13న పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ పర్యటన విజయవంతంపై చర్చించారు. నేతలు కందికట్ల రాజేశ్వరమ్మ, మిడతల రమేష్, యశ్వంత్‌సింగ్, పద్మావతి, సుబ్బయ్య, మనోజ్ఞ్రావ్య, నాగేంద్రసింగ్, చంద్ర, వీరరాఘవులు, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

వామపక్ష నేతల నిరసన



నెల్లూరు(వీఆర్సీసెంటర్): స్మార్ట్ మీటర్ల ఏర్పాటును నిరసిస్తూ నగరంలోని విద్యుత్ భవన్ వద్ద ధర్నాను వామపక్ష నేతలు మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడారు. స్మార్ట్ మీటర్లను ఏర్పాటు చేస్తే పగలగొట్టాలని ప్రతిపక్షంలో ఉన్న సమయంలో టీడీపీ నేతలు పిలుపునిచ్చారని, అయితే ప్రస్తుతం అధికారంలోకి వచ్చాక వీటిని బిగించేందుకు ఉపక్రమించడం దారుణమన్నారు. వీటిని నిలపకపోతే ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని స్పష్టం చేశారు. అనంతరం ఎస్ఈ విజయన్‌కు వినతి పత్రాన్ని సమర్పించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్, సీపీఐ ఎమ్మెల్ నేత రాంబాబు, సీపీఐ జిల్లా కార్యదర్శి దామా అంకయ్య, మాదాల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఆర్డీఎస్సెస్‌తో మౌలిక వసతుల అభివృద్ధి


మాట్లాడుతున్న విజయన్

నెల్లూరు (వీఆర్సీసెంటర్): కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన రీవాంప్డ్ డిస్ట్రిబ్యూషన్ సెక్టార్ స్కీమ్ (ఆర్డీఎస్సెస్) ద్వారా రూ.400 కోట్లతో జిల్లాలో విద్యుత్ సరఫరా వ్యవస్థ, మౌలిక వసతుల అభివృద్ధి పనులు జరుగుతున్నాయని ఎస్పీడీసీఎల్ జిల్లా సర్కిల్ ఎస్ఈ విజయన్ పేర్కొన్నారు. నగరంలోని విద్యుత్ భవన్‌లో విద్యుత్ శాఖ నెల్లూరు టౌన్ డివిజన్ అధికారులతో సమీక్ష సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. వినియోగదారుల నుంచి వచ్చే ఫిర్యాదులపై సిబ్బంది ఏ విధంగా స్పందిస్తున్నారనే అంశాన్ని ఆరాతీశారు. ఎవరైనా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని స్పష్టం చేశారు. ఈఈ శ్రీధర్, డీఈఈ అశోక్, సునీల్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

యంత్రంతో పారిశుధ్య పనులు

నెల్లూరు రూరల్: కలెక్టరేట్ ఆవరణలో పరిసరాలను యంత్రం ద్వారా మంగళవారం శుభ్రపర్చారు. పారిశుధ్య కార్మికుల ద్వారా గతంతో ఈ ప్రక్రియను చేపట్టేవారు. అయితే ప్రస్తుతం యంత్రాన్ని వినియోగిస్తున్నారు.

డాక్టరేట్ ప్రదానం

నెల్లూరు (టౌన్): తిరుపతిలోని ఎస్వీసీఈ కళాశాలలో అధ్యాపకుడిగా పనిచేస్తున్న నెల్లూరుకు చెందిన అల్లాబక్షుకు డాక్టరేట్ లభించింది. ఎన్బీకేఆర్ ఇంజినీరింగ్ కళాశాల ప్రొఫెసర్ మహబూబ్‌బాషా పర్యవేక్షణలో పరిశోధన చేయడంతో డాక్టరేట్‌ను జేఎన్టీయూ అనంతపురం వారు ప్రదానం చేశారు. ఆయన్ను కళాశాల ప్రిన్సిపల్ సుధాకర్‌రెడ్డి, ఈసీఈ విభాగాధిపతి శ్రీనివాసులురెడ్డి అభినందించారు.

బంగారు నెక్లెస్ మాయంపై కేసు నమోదు

నెల్లూరు(క్రైమ్): బీరువాలోని బంగారు నెక్లెస్ మాయమైన ఘటనపై కేసును చిన్నబజార్ పోలీసులు నమోదు చేశారు. వివరాలు.. రాజీవ్‌గృహకల్పలో నివాసం ఉంటున్న సునీల్ కుమారి ఇంట్లో అదే ప్రాంతానికి చెందిన ఓ మహిళ ఏడు నెలలుగా పనిచేస్తూ ఇటీవల అకస్మాత్తుగా మానేశారు. ఈ తరుణంలో బీరువాలో ఉన్న బంగారు ఆభరణాలను గత నెల 27న సునీల్‌కుమారి చూడగా, అందులో ఉన్న 13 గ్రాముల నెక్లెస్ కనిపించలేదు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. తన ఇంట్లో పనిచేస్తూ మానేసిన మహిళపై అనుమానం ఉందని ఫిర్యాదులో పేర్కొన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వీఆర్ హైస్కూల్ పనులపై లేఖా..?

నెల్లూరు సిటీ: వీఆర్ హైస్కూల్‌కు సంబంధించిన పనులపై లేఖ రాయడం తగదని డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్‌యాదవ్ పేర్కొన్నారు. మినీబైపాస్‌లోని తన కార్యాలయంలో విలేకరుల సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు.

నర్సింగ్ విద్యార్థిని అదృశ్యం

నెల్లూరు(క్రైమ్): నర్సింగ్ విద్యార్థిని అదృశ్యమైన ఘటనపై కేసును వేదాయపాళెం పోలీసులు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. బీవీనగర్‌లో ఓ నర్సింగ్ కళాశాల హాస్టల్ ఉంది. ఈ క్రమంలో హాస్టల్ నుంచి విద్యార్థి సోమవారం అదృశ్యమయ్యారు. గాలింపు చర్యలు చేపట్టినా ప్రయోజనం లేకపోవడంతో పోలీసులకు వార్డెన్ మహబూబ్‌జానీ ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని పలు సబ్‌స్టేషన్లలో మరమ్మతుల కారణంగా వివిధ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా బుధవారం ఉండదని నెల్లూరు టౌన్ ఈఈ శ్రీధర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సుందరయ్య కాలనీ ఫీడర్‌లోని సుందరయ్యకాలనీ, పడారుపల్లి తదితర ప్రాంతాల్లో ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం 12.30 వరకు సరఫరా ఉండదని చెప్పారు.

➡ డీకేడబ్ల్యూ ఫీడర్‌లోని నీలగిరి సంఘం, బట్వాడిపాళెం సెంటర్, నూతన ఎస్పీ కార్యాలయం, కేవీఆర్ పెట్రోల్ బంక్, కస్తూర్బా కళాక్షేత్రం తదితర ప్రాంతాల్లో ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు సరఫరా ఉండదని వివరించారు.

మేనేజర్‌కు సత్కారం



నెల్లూరు(వీఆర్సీసెంటర్): ఉద్యోగోన్నతి పొందిన విశాఖపట్నం కో ఆపరేటివ్ బ్యాంక్ మేనేజర్‌ను మంగళవారం సత్కరించారు. పప్పులవీధిలోని వీసీబీ నెల్లూరు బ్రాంచ్ కార్యాలయంలో మేనేజర్‌గా విధులు నిర్వహిస్తున్న రత్నబాబు ఉద్యోగోన్నతిపై గుంటూరుకు బదిలీ అవ్వడంతో ఆయన్ను సన్మానించారు. బ్యాంక్ డైరెక్టర్ నిర్మల, కమిటీ సభ్యులు ప్రసాద్, సుబ్బారావు, సురేంద్ర, వెంకటేశ్వర్లు, మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత విద్యుత్‌ను ఇవ్వాలని వినతి



నెల్లూరు(బృందావనం): వినాయక చవితి సందర్భంగా తాత్కాలికంగా ఏర్పాటు చేసే గణేశ్ మండపాలకు ఉచిత విద్యుత్‌ను ఇవ్వాలని విక్రమ సింహపురి గణేశ్ ఉత్సవ సమితి నిర్వాహకులు కోరారు. ఈ మేరకు ఎస్పీడీసీఎల్ జిల్లా సర్కిల్ ఎస్ఈ విజయన్‌కు వినతిపత్రాన్ని మంగళవారం అందజేశారు. సమితి గౌరవాధ్యక్షుడు సత్యనాగేశ్వరరావు, గౌరవ సలహాదారుడు సురేంద్రరెడ్డి, అధ్యక్షుడు శ్రీకాంత్, వేలూరు మహేష్, భాస్కర్‌రెడ్డి, హర్షవర్ధన్, శ్రీనివాసులురెడ్డి, సుందరరామిరెడ్డి, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

అనిల్‌ను నువ్వా విమర్శించేది..?


మాట్లాడుతున్న వైఎస్సార్సీపీ మైనార్టీ నేతలు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): మాజీ మంత్రి అనిల్‌కుమార్‌యాదవ్‌పై డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్ యాదవ్ అర్థరహిత విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మైనార్టీ విభాగ జిల్లా అధ్యక్షుడు సిద్ధిక్ పేర్కొన్నారు. నగరంలోని రాజన్న భవన్‌లో విలేకరులతో మంగళవారం ఆయన మాట్లాడారు. పార్టీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలకు కట్టుబడి నర్సరావుపేట ఎంపీ అభ్యర్థిగా పోటీ చేసిన వ్యక్తి అనిల్ అన్నారు. నెల్లూరు నగర నియోజకవర్గంలో ఖలీల్‌కు సీటివ్వగానే పార్టీని వదిలేసి టీడీపీలో చేరిన రూప్‌కుమార్ మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందన్నారు. ముస్లింలకు అండగా ఉంది అనిల్ అని తెలిపారు. ప్రెస్‌మీట్లు పెట్టి అబద్ధాలు చెప్పడం తప్ప నిజాలు మాట్లాడిన సందర్భాల్లేవన్నారు. నగరంలో అనేక సేవా కార్యక్రమాలను అనిల్ చేపట్టిన విషయం అందరికీ తెలుసునన్నారు. అనంతరం పార్టీ నేత అబ్దుల్ మస్తాన్ మాట్లాడారు. అనేక దందాలు చేసి మూలాపేటలో రూ.ఎనిమిది కోట్లతో పెద్ద భవనాన్ని రూప్ కుమార్‌యాదవ్ నిర్మించుకున్నారని ఆరోపించారు. ఇలాంటివి నచ్చకే ఆయన్ను అనిల్ దూరంగా పెట్టిన అంశాన్ని ప్రస్తావించారు. దీన్ని మనస్సులో పెట్టుకొని ఇష్టానుసారంగా మాట్లాడటం తగదని హితవు పలికారు. పార్టీ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు సిద్ధిక్, సమీర్‌ఖాన్, నేతలు మీరామొహిద్దీన్, బాబా, ఖయ్యూమ్ తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించరూ..


కలెక్టర్‌కు వినతిపత్రమిస్తున్న ఏపీయూడబ్ల్యూజే నేతలు

నెల్లూరు రూరల్: జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించాలని ఏపీయూడబ్ల్యూజే నేతలు కోరారు. ఈ మేరకు కలెక్టర్ ఆనంద్‌కు వినతిపత్రాన్ని మంగళవారం అందజేసిన అనంతరం వారు మాట్లాడారు. జర్నలిస్టులకు అక్రిడిటేషన్లను వెంటనే ఇవ్వాలని కోరారు. రాష్ట్ర నేత జయప్రకాష్, జిల్లా అధ్యక్షుడు వల్లూరు వెంకటేశ్వర్లు, జిల్లా ప్రధాన కార్యదర్శి మస్తాన్‌రెడ్డి, ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా అధ్యక్షుడు రమేష్, కోశాధికారి హనోక్, ఉపాధ్యక్షుడు దయాశంకర్, ఫొటోగ్రాఫర్స్ జిల్లా అధ్యక్షుడు మాల్యాద్రి తదితరులు పాల్గొన్నారు.

హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం



నెల్లూరు (టౌన్): తిరుపతిలో నిర్వహిస్తున్న స్టేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హోటల్ మేనేజ్‌మెంట్ కేటరింగ్ టెక్నాలజీ, అప్లయిడ్ న్యూట్రిషియన్‌లో వివిధ కోర్సులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని ఎస్ఐహెచ్ఎం అధ్యాపకుడు శివరామకృష్ణచౌదరి పేర్కొన్నారు. నగరంలోని హరిత హోటల్లో విలేకరులతో మంగళవారం ఆయన మాట్లాడారు. బీఎస్సీ (హెచ్ అండ్ హెచ్ఏ) మూడేళ్ల డిగ్రీ కోర్సుకు ఇంటర్‌లో 40 శాతం మార్కులకుపైగా ఉండాలని చెప్పారు. ఇందులో ఎఫ్ అండ్ బీ ప్రొడక్షన్, ఎఫ్ అండ్ బీ సర్వీస్, ఫ్రంటాఫీస్, హౌస్ కీపింగ్‌లో శిక్షణ ఇచ్చి నాలుగు నెలల పాటు ఫైవ్‌స్టార్ హోటళ్లలో ట్రెయినింగ్‌ను ఇవ్వనున్నామని పేర్కొన్నారు. సీసీఎఫ్‌పీపీ, సీసీఎఫ్‌బీఎస్ కోర్సులకు ఎస్సెస్సీ పాసైన వారు అర్హులని వివరించారు. వీటిని పూర్తి చేశాక రాష్ట్ర పర్యాటక శాఖ హోటళ్లు, ప్రముఖ ఫైవ్ స్టార్ హోటళ్లలో ఉద్యోగావకాశాలను కల్పించనున్నామని వెల్లడించారు. దరఖాస్తులను ఈ నెల 13లోపు పంపాలని, వివరాలకు 97013 43846, 91005 58006 నంబర్లను సంప్రదించాలని సూచించారు. యూనిట్ మేనేజర్ సాల్విన్‌రెడ్డి పాల్గొన్నారు.

సబ్‌స్టేషన్ వద్ద ధర్నా



నెల్లూరు సిటీ: స్మార్ట్ మీటర్ల ఏర్పాటును వ్యతిరేకిస్తూ సౌత్‌మోపూరులోని సబ్‌స్టేషన్ వద్ద ధర్నాను సీపీఎం నెల్లూరు రూరల్ మండల కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు ఆలూరు తిరుపాల్, మండల కార్యదర్శి పూడిపర్తి జనార్దన్ మాట్లాడారు. రకరకాల పేర్లతో చార్జీలను పెంచుతున్నారని ఆరోపించారు. రైతులకు సంబంధించిన ఉచిత విద్యుత్‌కు ఎసరుపెడుతున్నారని ధ్వజమెత్తారు. వ్యవసాయ పంప్‌సెట్లు, గృహాలకు ప్రీపెయిడ్ మీటర్ల ఏర్పాటుకు టెండర్లను పిలిచి, కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టేందుకు యత్నిస్తున్నారని మండిపడ్డారు. నేతలు రమణ, లక్ష్మీప్రసాద్, ప్రభాకర్, మస్తానయ్య, అబ్దుల్లా, వెంకటేశ్వర్లు, బాలు, ఆదిశేషయ్య, నాగరాజు, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

అవయవదానంతో పునర్జన్మ


మాట్లాడుతున్న రజనీకాంత్

నెల్లూరు(అర్బన్): అవయవదానంతో పునర్జన్మను ప్రసాదించొచ్చని చెన్నై గ్లెనిగల్స్ లివర్ ప్లాంటేషన్ సీనియర్ సర్జన్ పచ్చా రజనీకాంత్ పేర్కొన్నారు. జాతీయ అవయవదాన వారోత్సవాలను పురస్కరించుకొని లివర్ మార్పిడి చేయించుకున్న వారితో విలేకరుల సమావేశాన్ని సండే మార్కెట్ సమీపంలోని గ్లెనిగల్ క్లినిక్‌లో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. బ్రెయిన్‌డెడ్ అయి కోలుకోలేని పరిస్థితుల్లో ఉన్న సమయంలో సదరు వ్యక్తి అవయవాలను ప్రభుత్వ జీవన్‌దాన్ ట్రస్ట్ ద్వారా చట్టబద్ధంగా సేకరించి ఆపదలో ఉన్న వారికి అమర్చొచ్చని చెప్పారు. మార్కెటింగ్ మేనేజర్లు హర్ష, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

ఉమ్మడి సర్వీస్ రూల్స్ అమలుకు ఉద్యమం



నెల్లూరు (టౌన్): ఉపాధ్యాయులకు ఉమ్మడి సర్వీస్ రూల్స్‌ను అమలు చేయాలని, లేని పక్షంలో ఉద్యమ కార్యాచరణను చేపడతామని ఫ్యాప్టో నేతలు స్పష్టం చేశారు. అన్నమయ్య సర్కిల్లోని యూటీఎఫ్ భవనంలో రౌండ్ టేబుల్ సమావేశాన్ని ఫ్యాప్టో చైర్మన్ మధుసూదనన్‌వు అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. రాష్ట్రస్థాయిలో ఉపాధ్యాయ ఐక్య సంఘాల ఐక్య వేదిక ద్వారా ఉద్యమ కార్యాచరణను ప్రకటించి.. ఉద్యమాన్ని తీవ్రతరం చేయాలని ఏకగ్రీవంగా తీర్మానించారు. వివిధ సంఘాల నేతలు రమేష్, నవకోటేశ్వరరావు, మురళీకృష్ణ, ప్రసాద్, నరసింహులు, హజరత్ పిచ్చిబాబు, శ్రీనివాసరావు, మురళీధర్‌రావు, చలపతి తదితరులు పాల్గొన్నారు.